
అపరిచితుడు
మధుబాబు

# అపరిచితుడు

మధుబాబు

Kinige

APARICHITUDU

By :
MADHU BAABU

Edition:
January, 2013

Publishers :
SRI SRINIVASA PUBLICATIONS
4/4 Line, A.T.Agraharam, Guntur - 522 004.
Ph : 0863 - 2357945

This book is digitized and brought to you by KINIGE

© Author

© Madhu Baabu

This digital book is published by -

కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

All rights reserved.

No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.

# అపరిచితుడు

వీధిపక్కన పడివున్న చెత్తా చెదారాన్ని పోగుచేసి ఒకచోట గుట్టగా పడేశాడు రాందాసు. అది చాలదనిపించి పెద్దకాపు రమణయ్యగారి గడ్డివామిలోంచి పట్టెడు వరిగడ్డిని దూసుకొచ్చి ఆ గుట్టమీద పెట్టాడు. అటుగా పోతున్న మున్సబుగారి అల్లుడిని ఆపి అగ్గిపెట్టె తీసుకున్నాడు.

గప్పుమంటూ పైకి లేచింది పెద్దమంట. "ఓరి నీ యవ్వ... వర్షాలు లేవురా! ఇళ్ళు వాకిళ్ళు అన్నీ ఎండకు ఎండి ఫెళఫెళలాడుతున్నాయి. ఒక్కటంటే ఒక్క రవ్వపోయి పడిందంటే ఊరు ఊరంతా భగ్గుమంటుంది. మంట తగ్గించు" కంగారుగా హెచ్చరించాడు అల్లుడుగారు.

అతని అగ్గిపెట్టెని అతనికిచ్చి పక్కనే పెట్టిన తన దప్పుని చేతుల్లోకి తీసుకుని మంటమీద పెట్టాడు రాందాసు.

మంటమీద పెట్టమంటే నిప్పుల్లో కాల్చటం కాదు. తాచుపాముల్లా తలలు పైకి ఎత్తిన జ్వాలలకి కూసింత దూరంగా సెగ మాత్రమే తగిలేలా పట్టుకోవటం.

ఆ వేడికి దప్పుకున్న చర్మం సంకోచిస్తుందో, వ్యాకోచిస్తుందో ఎవరికీ తెలియదుగానీ, గట్టిగా వీస్తున్న గాలికి వైల్డ్‌గా అటూ ఇటూ ఊగుతున్న మంటల మీద అతను అలా దప్పుని కాచటం చూసి తీరాల్సిన దృశ్యం.

మోగటం అనే లక్షణాన్ని వదులుకుని డ్యాన్స్ చేస్తున్నదా ఆ దప్పు అని అనిపిస్తుంది ఎవరికైనా.. తొందరపనులేవీ లేనట్టు, దప్పుని కాచటం ఒక్కటే తన

జీవితధ్యేయం అన్నట్టు తీరికగా, తాపీగా, చాలా నిదానంగా పని పూర్తి చేసుకున్నాడు అతను ఇప్పుడు,

ఆ తర్వాత పైకి లేచి పాదాలతో కిందవున్న మట్టిని మంటలమీదికి నెట్టి కొండెక్కించేశాడు.

తూర్పు దిక్కుకేసి తిరిగి పైపైకి లేస్తున్న సూర్యభగవానుడికి నమస్కారం పెట్టుకున్నాడు.

“ఓరి నీ సస్పెన్సు దొంగలు తోల... విషయం చెప్పరా బాబూ” కోపంగా అడిగితే సమాధానం సరిగ్గా రాదని అనునయంగా అడిగాడు అల్లుడుగారు. ఎడమచంకకు డప్పు తాడును తగిలించుకుని, డప్పు అంచును గుండెలకేసి అదుముకుని, మూడే మూడు దెబ్బలు టమక టమక టకటకమని వేశాడు రాందాసు.

ఝల్లుమన్నాయ్ అల్లుడిగారి గుండెలు. తనకు తెలియకుండానే ఊపిరి బిగపట్టేశాడు అతను.

“సమస్తమయినవారికి తెలియచేయటమేమనగా, ఎల్లుండి నిండు పున్నమి రోజున అమ్మోరి గుళ్ళో కొత్త ధ్వజస్థంభం ఎత్తుతున్నారొహోయ్” అరమూసిన కళ్ళతో రాగయుక్తంగా అరిచాడు రాందాసు.

ఎవరి పనులమీద వాళ్ళు ఉరుకులు పరుగుల్తో చకచకా సాగిపోతున్న ఊరిజనం అందరూ ఎక్కడవాళ్ళక్కడ ఆగిపోయి చెవులు ఓరపట్టారు.

“అమ్మోరి ధ్వజస్థంభం ఎత్తటం అంటే మనూరి ఆడపడుచుల్ని కేకేసుకుని మర్యాదలు చేయటం... ఆడపడుచులు ఎక్కడున్నా, ఎంత దూరంలో వున్నా వెంటనే కబుర్లు పంపి, ఇళ్ళకు పిలిపించేసుకోండి... కొత్తబట్టలు పెట్టండి. పసుపు కుంకాలు వాయనాలు ఇవ్వండి... ఆ యమ్మల చేత్తో అమ్మోరి ముందు దీపాలు వెలిగించుకోండి. పిల్లా పాపలతో, మడులు మాన్యాలతో, పశువులతో, పంటలతో నాలుగుకాలాలపాటు సుఖంగా బతకండి. ఎన్ని తగాదాలున్నా, ఎన్ని కచ్చలు కార్పణ్యాలు వున్నా ఇది ఆడపడుచుల పండగని మర్చిపోవద్దుహోయ్.”

కంచుగంటవంటి కంఠంతో పెద్దపాట పాడినట్టు, విషయాన్నంతటినీ అరటిపండు వలిచి చేతిలో పెట్టినట్టు స్పష్టంగా వివరించాడు రాందాసు.

“బయట ఊళ్ళల్లో వున్న ఆడపడుచులకేనా ఇది? ఊళ్ళోనే వున్నవాళ్ళకి లేదా?” వెంటనే అడిగాడు కొంచెం వ్యంగ్యంగా– మున్సబుగారి అల్లుడు.

“అవతలికిపోయి వేరు కాపురం పెడితే చిన్నల్లుడికి ఆస్తి దోచిపెట్టేస్తారని ఇక్కడే మకాం పెట్టిన పెద్దాడపడులకి కూడా ఇది పండగే... పండగల్లో తేడాలు లేవహోయ్... వున్నవారికి, లేనివారికి అందరికీ ఇది పండగేనహోయ్... రాగయుక్తంగా సమాధానం ఇచ్చాడు రాందాసు.

అవి అన్యాపదేశంగా తనను మాత్రమే ఉద్దేశించి అరిచినవే అని అర్థం అయింది అతనికి. ఇక అక్కడే నిలబడితే అతను మరికొన్ని మాటలు జోడిస్తాడని గ్రహించుకుని, అర్జంటు పని ఏదో అప్పుడే జ్ఞాపకం వచ్చినట్టు హడావుడిగా వెళ్ళిపోయాడు అక్కడినించి.

దరువుమీద దరువు వేయటం మొదలుపెట్టి నెమ్మదిగా ముందుకు కదిలాడు రాందాసు.

వేపచెట్టు బజార్లో నిముషంపాటు నిలబడ్డాడు. బ్రాహ్మణబజార్లో ఇంకో నిముషం, యాదవులవాడలో మూడునిముషాలు, దుకాణాల సెంటర్లో పది నిముషాలు, అలా ఒకవీధి తర్వాత ఇంకోవీధిని కవర్‌చేస్తూ ఊరికి ఉత్తరంగా వున్న ఒక పెద్ద భవంతి దగ్గిరికెళ్ళాడు.

* * *

పొద్దు పొడవకముందే నిద్రలేచి ఆరు కిలోమీటర్ల దూరంలో వున్న తమ పొలాల దగ్గిరికి పోయి వాటిని, కొబ్బరితోటల్ని చూసుకొని, అంతకుముందే ఇంటికి చేరుకున్నాడు ఆ ఇంటిపెద్ద రాయుడుగారు.

అచ్చమైన వేపపుల్లలతో దంతధావనం చేసి, ఇంటిముందున్న అరుగుమీద కూర్చుని వున్నాడు. భార్య కంచుగ్లాసుతో తెచ్చిచ్చిన కాఫీని కొంచెం కొంచెంగా చప్పరిస్తూ చుట్టూ నిలబడ్డ పాలేర్లతో మాట్లాడుతున్నాడు.

డప్పును లయబద్ధంగా మోగిస్తూ, వాకిట్లోకి వచ్చి నిలబడిన రాందాసుని చూడగానే అందమైన నవ్వు ఒకటి ఆయన పెదాలమీదికి పరిగెత్తుకొచ్చింది.

“ఏంటోయ్ రాందాసూ! ఏంటీ విషయం?” అని నవ్వుతూనే అడిగాడు ఆయన.

“మీ పాదాలదగ్గిర బతికేటోడిని. ఏంటోయ్ గింటోయ్ అనకండి దొరా! ఏంటిరా అని అడగండి” డప్పుని తీసి ఆవరణ గేటుపక్కన పెడుతూ అన్నాడు రాందాసు.

“ఏడ్చావులే... ఎలా పిలిచినా నువ్వు మా మనిషివి. అమ్మగారు ఇవాళ పెసలు నానబోసింది. బహుశా పెసరట్లు వేస్తూ వుండి వుండవచ్చు. వెనక్కి పోయి నాలుగు అట్లు తిని వెళ్ళు” అన్నాడు రాయుడుగారు.

ఆయన మాటలు వినగానే నోరు మహా ఊరిపోతుంది రాందాసుకి. రాయుడిగారి భార్య నరసమ్మగారు ఏదైనా వంటకంచేస్తే దానికి పేరు పెట్టే ధైర్యం చుట్టుపట్ల పది ఊళ్ళ వాళ్ళకికూడా వుండదని పెద్దపేరు.

పెద్ద పాలేర్లు, చిన్న పాలేర్లు ఇంట్లో పనిచేసే పనివాళ్ళు చుట్టుపట్లవుండే స్నేహితులు, సన్నిహితులు అందరికీ కలిపి పావుబస్తా పెసలు ఖర్చయిపోతాయ్ ఆ రోజున. ముగ్గురు ఆడవాళ్ళు తెల్లారుఝామునించి మొదలుపెట్టి అలా రుబ్బుతోనే వుంటారు.

“చినబాబుగారు ఇంటికి రాలేదా దొరా?” ఈశాన్యంగా వున్న బావిదగ్గరికి పోయి అక్కడ వున్న తొట్టిలోని నీటితో కాళ్ళు చేతులు కడుక్కుంటూ అడిగాడు రాందాసు.

చిన్నబాబంటే రాయుడిగారికి రెండో కొడుకు. పట్నంలో అదేదో ఇంజనీరింగ్ చదువు చదువుతున్నాడు. పెద్దకొడుకు సుధీర్. కాలేజీ చదువులకి పోకుండా తండ్రికి వ్యవసాయంలో సాయంగా వుంటున్నాడు.

ఇద్దరు మగపిల్లల తర్వాత లచ్చిందేవిలా రాయుడిగారికి పుట్టింది ఒక ఆడపిల్ల. పద్దెనిమిదేళ్ళు వస్తున్నాయ్. తనుకూడా వూళ్ళోవున్న బడితోనే చదువు ఆపేసి, ఇంట్లో అమ్మకి సాయం చేస్తూ వుంటుంది.

“ఇప్పుడు నువ్వు చాటింపు వేసేది ఆడపడుచుల్ని గురించే కదా?” రాందాసుకి సమాధానం చెప్పకుండా ఎదురుప్రశ్న వేశాడు రాయుడుగారు.

“అవును దొరా... అయినా పండగంటే పండగే. బిడ్డలందరూ ఇంట్లో వుండాలి” అన్నాడు రాందాసు.

“ఆ మాటే వాడు వచ్చింతర్వాత వాడికి చెప్పు... చీరెలు, జాకెట్లూ పెట్టే పండక్కి నేను రావడం దేనికని ఫోను చేశాడు” నవ్వుతూనే అన్నాడు దొరగారు.

“చిన్నబాబుకి కోపం ఎప్పుడూ ముక్కుమీదే వుంటుంది. చొక్కాలు పట్టుకుని చదర్‌బద్దీ ఆడేస్తాడు. తట్టుకోవడం నావల్లకాదు” అంటూ గబగబా ఇంటి వెనక్కి పోయాడు రాందాసు.

“చాటింపు వేయడమైపోయిందా?” అడిగిందామె.

“పెద్దకాపుగారి బజారొక్కటే మిగిలిపోయింది. ఇంకో అరగంటలో అదికూడా అయిపోతుందమ్మా” వెంటనే సమాధానం ఇచ్చాడు రాందాసు.

“అయితే నీపని నువ్వు చూసుకో... అమ్మడూ... ఇటు చూడు” అంటూ కూతుర్ని పిలిచింది అమ్మగారు.

రుబ్బురోటిదగ్గిర పెసలు రుబ్బుతున్న పనిమనిషి లీలావతికి సాయం చేస్తున్న ఆడబిడ్డ చేతులు శుభ్రం చేసుకుని ఇంట్లోకి అడుగులు వేసింది.

“రాందాసుకి తిండిపుష్టి ఎక్కువ. వాడికి ఒకటి రెండు చాలవు. పది అట్లు పెట్టు. ఇంకో పది అరిటాకులో పొట్లం కట్టి ఇవ్వు. ఇంటికి తీసుకువెళతాడు” చిన్నకంఠంతో ఆమెకు చెప్పింది అమ్మగారు.

అంతకుముందే అరటితోటలోనించి తెప్పించిన పెద్ద అరిటాకులో ఆమె చెప్పినట్లుగా పది పెసరట్లు పెట్టుకుని రాందాసు దగ్గిరికి వచ్చింది లక్ష్మి.

"పండక్కి కొత్తబట్టలు తీసుకున్నారా అమ్మాయిగారూ?" ఆత్రంగా ఆ ఆకుని అందుకుని, నిలబడిన చోటులోనే నేలమీద బాసిపట్టు వేసుక్కూర్చుని లొట్టలేసుకుంటూ ఆరగిస్తూ అడిగాడు రాందాసు.

"నీకు ఈ మధ్య ఆడంగి కబుర్లు ఎక్కువైపోతున్నాయ్" నొసలు ముడివేసి చూస్తూ అన్నది లక్ష్మి.

"మీరు ఎలా అనుకున్నా సరే... ఆ మధ్య సంక్రాంతి పండగప్పుడు మీరు వేసుకున్నారే నీలరంగు ఓణీ... నెమలి ఫించం అంచు..." అన్నాడు రాందాసు.

తనకున్న రెండువందలో, మూడువందలో ఓణీల్లో అతను చెబుతున్నది ఏదో లక్ష్మికి గుర్తురాలేదు.

"ఏదో ఒకటి... నాకు గుర్తులేదు... ఇప్పుడు ఏమిటి నీ గోల?" విసుగ్గా అడిగింది ఆమె.

"దాన్ని చూసిన దగ్గిర్నుంచీ నా కూతురు ఒకటే గోల. అలాంటి బట్ట కావాలని అదేపనిగా చంపేస్తోంది. అదేదో నాకు దయ చేయించడమ్మా. చచ్చి నీ కడుపున పుడతా" ఏమాత్రం తడుముకోకుండా తన కోరికను బయటపెట్టాడు రాందాసు.

"నా కడుపున పుడితే నీకు డప్పులు కొనివ్వలేక నేను చచ్చిపోతాను గాని, సాయంత్రం మీ అమ్మాయిని నేను రమ్మన్నానని చెప్పు, చూసి ఇవాల్టికి సరిగ్గా

నెలరోజులయింది. నా దగ్గిరికి రాలేనంత బిజీపనులు తనకి ఏమున్నయ్యి?" అడిగిందామె.

"వేరుసెనగ కలుపులకి పోతోందమ్మా. రోజుకి ఇరవై ముప్పయ్ వస్తున్నయ్" పెసరట్లమీంచి దృష్టిని మరల్చకుండా చెప్పాడు రాందాసు.

"పని అయ్యాకే రమ్మని చెప్పు. తనకి ఇష్టమయినవి చూసి తీసుకుంటుంది. ఐనా పండక్కి కొత్తవి తీసుకోవాలి గాని పాతవి దేనికి?"

"మీ చేతులతో ఇచ్చినవి మాకు కొత్తవాటికిందే లెక్క. చల్లని చేతులు. ఒకటి ఇస్తే అవే వందకి సమానం."

"వింటూ వుండాలేగాని నువ్వు ములగచెట్టు ఎక్కించడంలో మొనగాడివి. తినటం ముగించి వచ్చినదారినే దయచెయ్..." అన్నదామె.

"ఏమిటా మాటలు లక్ష్మీ తప్పుకదూ..." లోపల్నించి హెచ్చరించింది ఆ మాటల్ని విన్న అమ్మగారు.

"చిన్నమ్మ తప్పేమీ మాట్లాడలేదమ్మా... మాట కొంచెం పెళుసైనా మనసు వెన్నపూస. నాకు తెలియదా?" తినటం ముగించేసి ఆకును మడిచి దూరంగావున్న కంపోస్ట్ ఏరియా దగ్గిర పడేసి వస్తూ అన్నాడు రాందాసు.

లక్ష్మి అందించిన అరిటాకు పొట్లాన్ని తీసుకుంటూ. "వచ్చే ఏడు ఈ పాటికల్లా మామిడికాయలు, చింతకాయలు తెచ్చిపెట్టమని నన్నే అడగాలి... పెద్ద చెరువు గట్టుమీద దయ్యాల చింత ఎక్కి కోసుకొస్తా. పుల్లపుల్లగా, తియ్యతియ్యగా భలేగా వుంటయ్ కాయలు..." అన్నాడు అతను.

“చూడమ్మా... పిచ్చి మాటలు...” అతనికి ఏమని సమాధానం ఇవ్వాలో వెంటనే తెలియకపోవటంతో, లోపల వున్న తల్లికి ఫిర్యాదు చేసింది లక్ష్మి.

“తప్పేముందిరా... తన కోరికని తను నిజాయితీగా బయటపెట్టాడు. వచ్చే ఏడు కాకపోయినా ఆపై వచ్చే ఏడయినా పెళ్ళి చేసుకోవా... తను చెప్తున్నవి అడగవా?” నవ్వుతూ సమాధానం ఇచ్చింది తల్లి.

“ఛీఛీ... మీరందరూ ఒక్కటే. నేనసలు ఇక్కడ వుండనే వుండను...” మూతి ముడుచుకుని విసురుగా ఇంటిముందుకు వెళ్ళిపోయింది లక్ష్మి.

పకపకా నవ్వింది అమ్మగారు. తనలో తను నవ్వుకుంటూ గేటుదగ్గిరకి బయలుదేరాడు రాందాసు.

* * *

సరిగ్గా అదే సమయంలో అప్పటికి వారంరోజులక్రితం తీసుకున్న హీరోహోండా మీద వేగంగా వచ్చాడు రాయుడిగారి పెద్దబ్బాయి సుధీర్.

వేగం ఏమాత్రం తగ్గించకుండా సూటిగా తనకెదురు వస్తున్న రాందాసుకి గురిపెట్టాడు బండిని...

“దాసుతో నీకు సరసాలు ఏమిటిరా పెద్దోడా? అతని వయస్సెంత నీ వయస్సెంత?” అది చూసిన రాయుడుగారు వెంటనే కోప్పడ్డారు తన బిడ్డడిని.

“ఈయనగారి వయస్సు ఎంతో మీరే అడగండి... నిన్న సాయంత్రం ఆ సముద్రాల సారాకొట్టు దగ్గర నిలబడి హీరోహోండా బండిని ఒంటిచక్రం మీద

నడిపిస్తానని ఎవరితోనో పందెం కట్టాట్ట. అడిగి చూడండి” బండికి స్టాండ్ వేస్తూ అన్నాడు సుధీర్.

“వెధవ సారా… ఒక్కచుక్క గొంతులోకి పోతే నువ్వయినా, నేనయినా అలాగే మాట్లాడతాం… వదిలేయ్… వెళ్ళిన పని ఏమైంది?” అడిగాడు రాయుడుగారు.

“గెలకి ఇంకో పదికంటే ఎక్కువ ఇవ్వలేనని అంటున్నాడు లక్ష్మీనరసింహం. అతనితో వ్యాపారం వద్దు. మనమే డైరెక్టుగా మార్కెట్‌కి పంపేద్దాం” అరటిగెలల వ్యాపారంగురించి మాట్లాడటానికి సూరేపల్లి గ్రామానికి వెళ్ళి వచ్చాడు కాబోలు, వెంటనే చెప్పాడు సుధీర్. “సూరేపల్లి ఎలా వుందయ్యా? ముఖ్యంగా ఆ పెద్దబజారులో మూడో మండువా ఇల్లు బాగుందా? పడమటివైపున ఒక కిటికీ వుంది. బజారులో బడ్డీకొట్టు దగ్గిర నిలబడి సోడా తాగుతుంటే ఆ కిటికీ మా బాగా కనిపిస్తుంది. ఇవాళ కనిపించిందా?” గేటుదగ్గిరికి పోయి దప్పుని చంకకు తగిలించుకుంటూ అడిగాడు రాందాసు.

“ఏంటిరా పెద్దోడా? సోడా ఏమిటి? కిటికీ కనిపించటం ఏమిటిరా?” ఆశ్చర్యంగా అడిగాడు రాయుడుగారు.

“ఈ రాందాసు ఇవాళ పొద్దున్నే పీకలదాక పట్టించాడు. సందేహం లేదు. అరేయ్ నాగులూ..” అంటూ చిన్నపాలేర్లలో ఒకతన్ని పిలిచాడు సుధీర్.

మూడేమూడు అంగల్లో వచ్చి అతని ఎదుట నిలబడ్డాడు అతను. “పట్టుకో. రెండు తీతలు తీస్తే తాగిందంతా దిగిపోతుంది” కచ్చగా అన్నాడు సుధీర్.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=2314**

* * *

**Read other books of Madhu Baabu @**

**http://kinige.com/kbrowse.php?via=author&name=Madhu+babu&id=20**